క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కె.రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఆటోనగర్, డీర్‌పార్కు ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ అంతరాయం ఉంటుందన్నారు.

ప్రచార కమిటీ కార్యనిర్వాహక సభ్యుడిగా జంగారెడ్డి



కందుకూరు: పీసీసీ ప్రచార కమిటీ కార్యనిర్వాహక సభ్యుడిగా కందుకూరు మండలం దెబ్బడగూడకు చెందిన జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శుక్రవారం ప్రకటించారు. దీంతో శనివారం జంగారెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఎన్నికల ప్రచార కమిటీలో భాగస్వామిని చేసినందుకు ఖర్గేతో పాటు పీసీసీ నేతలకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేస్తానన్నారు.

మౌలిక వసతులు కల్పిస్తాం

మేయర్ పారిజాత



పనులను పరిశీలిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 4వ డివిజన్‌లోని రామిడి హిల్స్‌లో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను శనివారం కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్ని కాలనీలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాలనీలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు, కాలనీవాసులకు సీసీ రోడ్డును అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, సామ భాస్కర్ రెడ్డి, ఏఈఈ విశాల్‌గౌడ్, సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

విద్యతోనే విద్యార్థుల ఉన్నతి



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

మీర్‌పేట: విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని భాష్యం పాఠశాల జోనల్ ఇన్‌చార్జి అంకమ్మరావు అన్నారు. స్థానిక భాష్యం పాఠశాలలో శనివారం నిర్వహించిన ఫ్రెషర్స్‌డే వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి జీవితంలో పాఠశాల దశ కీలకమని, కష్టపడి చదువుతూ.. బంగారు భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలని సూచించారు. అనంతరం ప్రిన్సిపాల్ స్రవంతి మాట్లాడుతూ.. విద్యతో పాటు అన్ని అంశాల్లో ప్రతిభ చాటేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో లిటిల్ ఛాంప్స్ ప్రిన్సిపాల్ శృతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ప్రారంభం

హస్తినాపురం: ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని వనస్థలిపురం డివిజన్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి అన్నారు. శనివారం పీఎస్ పరిధిలోని విజయశ్రీకాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన 9 సీసీ కెమెరాలను వనస్థలిపురం సీఐ జలేంధర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు అద్దెకు వచ్చే వారి పూర్తి వివరాలు తెలుసుకొని, ఆధార్‌కార్డులు తీసుకున్న తర్వాతే ఇళ్లను అద్దెకు ఇవ్వాలని సూచించారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, డీఐ వెంకట్, ఎస్‌ఐలు మాధవరెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌సీటీపీ తనిఖీ

ఎల్‌బీనగర్: నాగోల్‌లోని సెకండరీ కలెక్షన్ ట్రాన్స్‌ఫర్ పాయింట్ (ఎస్‌సీటీపీ)ను జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన చెత్త తరలింపు విధానాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఉప్పల్ చిలుకానగర్ వార్డు పరిసరాల్లో గార్బేజ్ వుల్నెరబుల్ పాయింట్స్‌ను తనిఖీ చేశారు. నాగోల్‌లో స్థానిక కాలనీవాసులు, శానిటరీ సిబ్బందితో మాట్లాడారు. స్వచ్ఛ ఆటో డ్రైవర్లను తడి చెత్త, పొడి చెత్త వేరు చేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. స్వచ్ఛ ఆటోకు చెత్తను ఇవ్వాలని కాలనీవాసులకు సూచించారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ ఎస్.పంకజ, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రంజిత్, హయత్‌నగర్ సర్కిల్ డీసీ మారుతీ దివాకర్, ఉప్పల్ డీసీ అరుణకుమారి, అసిస్టెంట్ మెడికల్ అండ్ హెల్త్ అధికారులు, డీఈ, ఈఎస్‌డబ్ల్యూఎంలు, రాంకీ సిబ్బంది పాల్గొన్నారు.

కాటమయ్యకు బోనాలు.. అమ్మవార్లకు ఘటాలు



ఘటాల ఊరేగింపులో పాల్గొన్న పారిజాత, ఇబ్రాం శేఖర్ తదితరులు



కాటమయ్య బోనాల ఉత్సవంలో పాల్గొన్న దేప భాస్కర్‌రెడ్డి

అంబరాన్నంటుతున్న ఆషాఢ మాస ఉత్సవాలు

బడంగ్‌పేట్: డివిజన్ పరిధిలో బోనాల సంబురాలు అంబరాన్ని అంటుతున్నాయి. ఉత్సవాల సందర్భంగా శుక్రవారం రాత్రి బాలాపూర్‌లో పోచమ్మ, బంగారు మైసమ్మ తల్లులకు డప్పు చప్పుల్లు, పోతురాజుల నృత్యాల నడుమ ఘటాల ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఘటాల ఊరేగింపులో కార్పొరేషన్ మేయర్ పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్ రెడ్డి, ఎర్ర మహేశ్వరి జైహింద్, బండారి మనోహర్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఎల్మేటి అమరేందర్ రెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, సహకార బ్యాంక్ అధ్యక్షుడు సింగిరెడ్డి పెంటారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు వంగేటి లక్ష్మారెడ్డి, బి.జంగయ్య, రాజు, గిరీష్, శ్రీశైలం, శ్రీనివాస్‌రెడ్డి, నిర్వాహకులు శ్రీకాంత్‌లడ్డు, నరహరిగౌడ్, బాలాపూర్ గ్రామస్తులు వివిధ పార్టీల నేతలు తదితరులు పాల్గొన్నారు.

నాదర్‌గుల్‌లో కాటమయ్య బోనాలు

నాదర్‌గుల్‌లో శనివారం కాటమయ్య బోనాలు వైభవంగా నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనమెత్తి ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని స్వామి వారికి బోనం సమర్పించారు. సోషల్ మీడియా కన్వీనర్ వెంకటేశ్‌గౌడ్ ఆహ్వానం మేరకు టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవాల్లో ఎన్నికల కమిటీ జిల్లా కార్యదర్శి బంగారు బాబు, జగన్, కుమార్‌గౌడ్, ధనరాజ్, రమేశ్, రవికుమార్, వెంకటేశ్‌యాప్ పాల్గొన్నారు.

సింగిల్ రోడ్డుతో సతమతం

- గుంతలమయంగా రావిర్యాల–సర్దార్‌నగర్ రహదారి
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు

తుక్కుగూడ: రాష్ట్ర ప్రభుత్వం రోడ్ల అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు వెచ్చిస్తున్నామని ప్రకటనలు చేస్తున్నా అవి కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయని పలువురు చర్చించుకుంటున్నారు. ఇందుకు మున్సిపాలిటీ పరిధిలోని రోడ్లే ఉదాహరణగా చూపుతున్నారు. రావిర్యాల నుంచి సర్దార్‌నగర్, తుక్కుగూడ గ్రామాలకున్న సింగిల్ రోడ్డు మరింత అధ్వానంగా మారింది. ఈ రోడ్డు పూర్తిగా రావిర్యాల పెద్ద చెరువు శిఖం భూమిలో ఉంది. వరుసగా కురుస్తున్న వర్షాలకు చెరువు నిండి రోడ్డు నీట మునిగి దెబ్బతిని గుంతలమయంగా మారింది.

శిథిలావస్థకు చేరిన వంతెన

భాగ్ మంఖాల్ చెరువు నుంచి.. రావిర్యాల చెరువులోకి వచ్చే వరద పులిందర్ వాగు ఇదే రోడ్డులో ఉండడంతో గతంలో బ్రిడ్జిని నిర్మించారు. దీని అభివృద్ధిని ఎవరూ పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం ఈ వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరింది. గతేడాది వరద వంతెన మీదుగా ప్రవహించడంతో అధికారులు కొన్ని నెలలపాటు రాకపోకలు నిషేధించారు. ప్రయాణికులు, రైతులు ఈ రోడ్డు మీదుగా ప్రవహించడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయానికి వెళ్లే భక్తులతో మంగళవారం మరింత రద్దీగా ఉంటుంది. వీరంతా ఈ మార్గంలో ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సింగల్ రోడ్డు కావడంతో ప్రయాణం ప్రయాసగా మారుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు వెడల్పు పనులు చేపట్టి బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.



సర్దార్‌నగర్-రావిర్యాల రోడ్డు దుస్థితి

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సబితారెడ్డి

మంత్రి సబితారెడ్డి

మీర్‌పేట: నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నామని మంత్రి సబితారెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 12, 13వ డివిజన్ల పరిధిలోని చింతల్‌కుంట కాలనీ, బృందావన్‌కాలనీ, ప్రశాంత్‌నగర్ ఫేజ్–2 కాలనీల్లో రూ.1.50కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులకు శనివారం ఆమె శంకుస్థాపన, కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కమిషనర్ సీహెచ్.నాగేశ్వర్, డీఈ గోపీనాథ్, కార్పొరేటర్లు ఇంద్రావత్ రవినాయక్, నందుకుమార్, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల డిమాండ్లు పరిష్కరించండి

సీఐటీయూ మండల కన్వీనర్ బాలరాజు



జీపీ కార్మికుల సహపంక్తి భోజనాలు

కందుకూరు: పంచాయతీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాలరాజు కోరారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన సమ్మె శనివారంతో 10వ రోజుకు చేరింది. ఈ సమ్మెలో భాగంగా వంటావార్పు చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. వీరి సమ్మెకు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు డి.రాంచందర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు ఎ.కుమార్, సీపీఎం మండల కార్యదర్శి బి.శ్రీనివాస్ మద్దతు తెలిపి మాట్లాడారు. పది రోజులుగా జీపీ కార్మికులు సమ్మె చేస్తున్న ప్రభుత్వంలో చలనం లేకపోవడం దారుణమని విమర్శించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే రాబోయే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో కారోబార్లు బాల్‌రాజ్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి, జీపీ సిబ్బంది యాదయ్య, దశరథ, మహేశ్, మల్లయ్య, భిక్షపతి, జంగమ్మ, రాధ, జయమ్మ, చెన్నమ్మ, రుక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కృష్ణారెడ్డి

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధి కోసం మంత్రి సబితారెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు, మాజీ సర్పంచ్ సూరెడ్డి కృష్ణారెడ్డి అన్నారు. శనివారం ఆయన శ్రీరాంకాలనీ 17వ వార్డులో రూ.41 లక్షల హెచ్‌ఎండీఏ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. జల్‌పల్లి మున్సిపాలిటీలో కోట్లాది రూపాయల నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు. జల్‌పల్లి కమాన్ రోడ్డు, మరాఠా భవన్ రహదారి నిర్మాణాలతో మున్సిపాలిటీ పరిధిలో రాకపోకలు సాగించే వారికి వెసులుబాటుగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మున్సిపల్ కార్యనిర్వాహక అధ్యక్షుడు షేక్ జహంగీర్, యంజాల జనార్దన్, సీనియర్ నాయకులు సయీద్ పటేల్, సూరెడ్డి గోపాల్ రెడ్డి, నాగేష్ ముదిరాజ్, ఇద్రీస్, నరేందర్, ప్రవీణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీవీఆర్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

విద్యార్థులకు పట్టాలు అందజేసిన ఈసీఐఎల్ చైర్మన్ అనురాగ్ కుమార్, ఇస్రో డైరెక్టర్ పీవీ రాధాదేవి



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న పీవీ రాధాదేవి

ఇబ్రహీంపట్నం రూరల్: విద్యార్థుల చదువులు సమాజాభివృద్ధితో పాటు దేశానికి ఉపయోగపడేలా ఉండాలని ఈసీఐఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అనురాగ్ కుమార్ అన్నారు. శనివారం సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 19వ గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా అనురాగ్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు కొత్త విషయాలపై పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. అనంతరం అడ్రిన్ ఇస్రో సంస్థ డైరెక్టర్ డాక్టర్ పీవీ రాధాదేవి మాట్లాడుతూ.. కష్టపడితేనే ఫలితం దక్కుతుందన్నారు. ఇస్రో సంస్థ శుక్రవారం ప్రయోగించిన చంద్రయాన్–3 విజయవంతంలో తన భాగస్వామ్యం ఉందని తెలిపారు. అత్యధికంగా రూ.57లక్షల ప్యాకేజీ తీసుకునేందుకు సహకరించిన అసోసియేట్ డీన్ ప్లేస్‌మెంట్ విజయమేరీని ఆమె అభినందించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ రాఘవ చెరబుడి, కళాశాల అడ్వైజర్ మధుసూదన్‌రెడ్డి, డైరెక్టర్ రామశాస్త్రి, ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శివారెడ్డి, అసోసియేట్ డీన్ ప్లేస్‌మెంట్ విజయమేరీ, డీన్ అకాడమిక్స్ డాక్టర్ నయనతార, విద్యార్థులు, పట్టభద్రులు, ఆచార్యులు పాల్గొన్నారు.

ప్రజల ఆర్థిక ప్రగతికి బ్యాంకుల సహకారం

హైదరాబాద్ జోన్ చీఫ్ జనరల్ మేనేజర్ భాస్కర్‌రావు



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న భాస్కర్‌రావు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజల ఆర్థిక ప్రగతికి బ్యాంకులు సహకరించాలని యూనియన్ బ్యాంకు హైదరాబాద్ జోన్ చీఫ్ జనరల్ మేనేజర్ కారే భాస్కర్‌రావు పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీలోని టీసీఎస్ ఎదుట నూతనంగా ఏర్పాటు చేసిన యూనియన్ బ్యాంకు భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం కోటి రూపాయల రుణాలను స్వయం సహాయక సంఘాలకు అందజేశారు. రెండు కార్లకు గాను రూ.17 లక్షలు రుణాలు, రూ.84 లక్షల గృహ రుణాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు మాట్లాడుతూ.. ప్రజల ఆర్థిక పరిస్థితులు మెరుగుపర్చడానికి నిరంతరం పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి బ్యాంకు అభివృద్ధికి లబ్ధిదారులు సహకరించాలని తెలిపారు. మహిళా పొదుపు సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే వారికి రుణాలు అందించి, స్వయం ఉపాధి కల్పించే విధంగా తోడ్పాటునందించాలని సూచించారు. కార్యక్రమంలో హైదరాబాద్ రిజియన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కల్యాణ్ వర్మ, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ జె.జుమైలాల్, చిట్ మేనేజర్ శ్రీనివాస్, బ్రాంచ్ మేనేజర్ చత్రు అంబోతు, సిబ్బంది రమేష్‌బాబు, మహేందర్, రమేశ్, స్థానికులు పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రతిష్ఠాపనోత్సవం

అమ్మవారి కల్యాణానికి హాజరైన నేతలు

మహేశ్వరం: మండల పరిధిలోని రామచంద్రగూడ గ్రామంలో శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో సింహవాహన, నాగ, శిఖర ప్రతిష్ఠాపన పూజలు మూడో రోజు శనివారం వైభవంగా కొనసాగాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం 10.35 గంటలకు అమ్మవారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారను. కల్యాణ మహోత్సవానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాతరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్ తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రామచంద్రగూడ సర్పంచ్ అంగోత్ శివినాయక్, ఉప సర్పంచ్ కాటారం అభిలాష్ గౌడ్, ఎంపీటీసీ సభ్యురాలు స్వప్న, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అంగోత్ రాజు నాయక్, సిద్దేశ్వర్ గౌడ్, దయానంద్ గౌడ్, రమేశ్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, రాజు గౌడ్, దేశ్యా నాయక్, కృష్ణ నాయక్, దస్రు నాయక్, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు మహిళల అదృశ్యం



యాదమ్మ (ఫైల్)



అంజమ్మ (ఫైల్)

పహాడీషరీఫ్: ఇద్దరు మహిళలు అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. కేశంపేట మండలం నిర్దవల్లి గ్రామానికి చెందిన ఏపూరి యాదమ్మ(47) తన బంధువు అంజమ్మ(70)తో కలిసి ఈ నెల 11న తుక్కుగూడ మంఖాలలో ఉండే కూతురు నిర్మల ఇంటికి వచ్చారు. 13న సాయంత్రం తిరిగి వెళ్లేందుకు ఇద్దరిని నిర్మల మంఖాల గేట్ వద్ద వదిలింది. రాత్రి 8 గంటల ప్రాంతంలో తన సోదరుడు రాజశేఖర్‌కు ఫోన్ చేసి వాకబు చేయగా ఇంటికి రాలేదని చెప్పాడు. వారికోసం గాలించినా ఫలితం లేకపోవడంతో రాజశేఖర్ శనివారం పహాడీషరీఫ్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్ పీఎస్‌లో గాని 87126 62367 నంబర్‌లో సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

పరామర్శ

తుర్కయంజాల్: బీజేపీ సీనియర్ నేత జీఆర్ కరుణాకర్ సతీమణి హంసవేణి ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ శనివారం కరుణాకర్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దయానంద్‌గౌడ్, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు రమేశ్, రిటైర్డ్ ఇంజనీర్స్ ఫోరం అధ్యక్షుడు శ్యాంప్రసాద్ రెడ్డి ఉన్నారు.

ప్రహరీ నిర్మాణాన్ని అడ్డుకోవాలి

కార్పొరేటర్ శ్రీవాణికి యువత వినతి



కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేస్తున్న యువకులు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ మండలంలోని మైదానానికి ప్రహరీ నిర్మించి ఆటలకు ఆటంకం కలిగించొద్దని కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని యువజన సంఘాలు మండల ఆఫీసు వెనకాల ఉన్న క్రీడా మైదానంలో డివిజన్ యువత ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కార్పొరేటర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దశాబ్దాలుగా ఈ ఒక్క క్రీడా మైదానమే ఇక్కడి యువతకు అందుబాటులో ఉందని.. గత 25ఏళ్ల కాలంలో ఈ మైదానంలో అనేక ప్రభుత్వ భవనాలు, ప్రభుత్వ కళాశాల వెలిశాయని, దీంతో క్రీడా మైదానం చిన్నగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ప్రభుత్వ అధికారులు ప్రహరీ నిర్మించ తలపెట్టారని, మైదానంలో గోడ నిర్మిస్తే అది మరింత చిన్నబడిపోతుందని కార్పొరేటర్‌కు వివరించారు. స్పందించిన ఆకుల శ్రీవాణి మైదానంలో నిర్మాణాలు చేపట్టకుండా కృషి చేస్తానని, సంబంధిత అధికారుల దృష్టికి విషయాన్ని వివరిస్తానని హామీ ఇచ్చారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

ఇబ్రహీంపట్నం: విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో వారం రోజులుగా కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం శనివారం ఇబ్రహీంపట్నం బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించిన పడమటి అన్వితారెడ్డితో కలిసి సత్తు వెంకటరమణారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం రీడింగ్ కార్నర్‌లను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ప్రతి రోజు గ్రంథాలయ తరగతికి విద్యార్థులు హాజరయ్యేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలన్నారు. అనంతరం అన్వితారెడ్డి మాట్లాడుతూ.. అమ్మాయిలు ఏరంగంలోనైనా అబ్బాయిలతో తీసిపోరని.. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. పేద రైతు కుటుంబానికి చెందిన తాను ఎంతో ఇష్టంతో పర్వతారోహణ చేశానని చెప్పారు. ఎవరెస్ట్ శిఖరంపై సగర్వంగా భారతీయ జెండాను ఎగురవేసి తెలంగాణ ఖ్యాతిని నలుదిశలా చాటానని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీ, ఉపసర్పంచ్ భగీరథ్, విద్యాకమిటీ చైర్‌పర్సన్ మస్రత్‌జహా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్షుద్రపూజల కలకలం



జమ్మిచెట్టుకు కట్టిన నల్లని వస్త్రం

ఇబ్రహీంపట్నం: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని జమ్మిచెట్టుకు గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్రపూజలు చేసారంటూ శనివారం కలకలం చెలరేగింది. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మహిళా బ్యాంకు, పీఆర్ ఇంజనీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, వ్యవసాయ, విద్యావనరుల కేంద్రం, ఐకేపీ కార్యాలయాలతో పాటు న్యాయస్థానాలున్నాయి. ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయ అరుగు పక్కన జమ్మిచెట్టు ఉంది. శుక్రవారం సాయంత్రం పాఠశాలలకు డిజిటల్ పరికరాలు, సైన్స్ సామగ్రి పంపిణీ కార్యక్రమం అక్కడే నిర్వహించారు. అప్పుడు జమ్మి చెట్టుకు పూజలు చేసిన ఆనవాళ్లు కనిపించలేదు. అయితే, శనివారం ఉదయం జమ్మి చెట్టు వద్ద ఉప్పు పోసి పసుపు, కుంకుమ చల్లి, నిమ్మకాయలు కోసి కొబ్బరికాయలు కొట్టి హారతి వెలిగించిన దృశ్యాలు దర్శనమిచ్చాయి. అంతేగాక ఓ మూట మాదిరిగా ఉన్న నల్లని బట్టకు(వస్త్రం) పసుపు కుంకుమలు పూసి జమ్మిచెట్టుకు కట్టి ఉండడం తీవ్ర కలకలం రేపింది. ఆయా కార్యాలయాలకు వచ్చిన పలువురు సిబ్బంది, ప్రజలు చూసి భయాందోళనలకు గురైయ్యారు. ఇలాంటి పూజలు చేయడం పట్ల పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మహిళ బ్యాంకు వద్ద సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ అవి పనిచేయకపోవడంతో ఎవ్వరూ పూజలు చేసారనే విషయం స్పష్టం కాలేదు. కార్యాలయ వాచ్‌మెన్ తాను ఉదయం చూసేసరికి ఈ జమ్మిచెట్టుకు పూజలు చేసినట్లు కనపడిందని చెప్పాడు. మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.